డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తాం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచేందుకు అవసరమైన చోట కొత్తగా మున్సిపల్ నిధులు వెచ్చించి భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం 8వ వార్డులోని ఎస్వీ నగర్ కాలనీలో సుమారు రూ. 6.5 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. కౌన్సిలర్ కౌకుట్ల మమత కృష్ణారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సీఎంఆర్‌టీసీ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అతిథులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాల 12వ గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం ఘనంగా జరిగింది. డీఆర్‌డీఎల్ సైంటిస్ట్ ఆకుల నరేశ్, క్యాప్ జెమిని డిప్యూటీ సెంటర్ హెడ్ ఉమామహేశ్వర్‌రావు, సీఎంఆర్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వైస్ చైర్మన్ అభినవ్‌రెడ్డి, సెక్రటరీ వసంత లత, డైరెక్టర్ రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి కమిషనర్‌కు సన్మానం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వామిని శుక్రవారం బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంసరాణి, నాయకులు మహేశ్, కిషన్, అశోక్ తదితరులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి శాలువాలతో సత్కరించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

కీసర: నాణ్యత, ప్రమాణాలను పాటిస్తూ నాగారం మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను చేపడతామని మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం 13వ వార్డులో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మున్సిపల్ డీఈఈ రఘు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్: ఆర్థిక సమస్యలతో మెరుగైన వైద్యాన్ని పొందలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరంలా ఆదుకుంటోందని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు, అదే గ్రామానికి చెందిన జి.సవిత అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి లబ్ధిదారులైన ఆంజనేయులకు రూ. 41,500., జి. సవితకు రూ. 55 వేలు మంజూరయ్యాయి. ఆయా చెక్కులను వజ్రేష్‌యాదవ్ శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు.

కాశీలో పూజకు 40 వేల శివలింగాల తయారీ



మేడ్చల్: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కాశీలో శివలింగాల పూజకు మేడ్చల్ అయ్యప్ప దేవాలయంలో భక్తులు 40 వేల శివలింగాలను తయారు చేశారు. రెండు నెలల పాటు భక్తులు, మహిళలు నిత్యం నిష్ఠతో ఆలయంలో శివలింగాలను మట్టితో తయారు చేశారు. 40 వేల శివలింగాలను తయారు చేసి కాశీకి తరలించడనికి అందజేశారు. నవంబర్ 4 నుంచి 13వ తేదీ వరకు కాశీనగరంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించే కోటి శివలింగాల పూజా కార్యక్రమానికి మేడ్చల్‌లో లింగాలను తయారు చేశారు. మేడ్చల్‌కు చెందిన వైశ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి రాజేశ్వరగుప్తా, శివకుమార్, రాజేష్, పట్టణ ఆర్యవైశ్య కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

శామీర్‌పేట్: సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని జవహర్‌నగర్ మేయర్ శాంతి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజ ఆధ్వర్యంలో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ... గతంలో డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లపై పారే మురుగు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. యూజీడీ పనులు పూర్తి అయితే ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్ శారద, నాయకులు అశోక్, రాజు, వెంకటేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలి

శామీర్‌పేట్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శామీర్‌పేట మండల పరిపాలన భవనాల సముదాయంలోకి మార్చాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అలియాబాద్ చౌరస్తాలో విలేకరులతో మాట్లాడుతూ... 1996 నుంచి శామీర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. శామీర్‌పేటలోని పాలన భవనాల సముదాయంలోని స్నేహా బిల్డింగ్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి కొందరు ప్రైవేటు వ్యక్తుల స్వార్థం కోసం దర్గా వద్ద ఉన్న భవనానికి మార్చాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ శామీర్‌పేట మండల డీజీ కార్యదర్శి నరేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ పల్లె సీతారాములుగౌడ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహా, గాదె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం!

ఈ నెల 5 నుంచి 9 వరకు బృహత్తర కార్యక్రమం

- గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాల నిర్వహణకు సన్నద్ధం
- మార్గదర్శకాలను జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, సిటీబ్యూరో: గ్రామాలు, పట్టణాల్లో ఈ నెల 5 (సోమవారం) నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం – పచ్చదనం' పేరిట అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీల్లో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో.. వివిధ శాఖల సమన్వయంతో' స్వచ్ఛదనం–పచ్చదనం' విజయవంతంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

స్వచ్ఛదనం– పచ్చదనం ఇలా...

స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలోభాగంగా 5 రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రైడే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీట్యాంకులు, పశువులు తొట్లను శుభ్రం చేయడం, లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయించటం వంటి పనులు చేపట్టాల్సి ఉంటోంది. ఎండిన మొక్కలు తొలగించి కొత్త మొక్కలు నాటాల్సి ఉంటోంది.

ఈ నెల 5న (ఒకటో రోజు) గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాలు, యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇళ్లలోని చెత్తను సేకరించి కంపోస్టు ఎరువులు తయారుచేయాలి. పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపరచాలి. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలి. మరుగుదొడ్లు లేని వారికి వాటిని మంజూరు చేయాల్సి ఉంటోంది.

ఈ నెల 6న (రెండోరోజు) తాగునీటి వనరులను శుభ్రపరచటం, రోజూ క్లోరినేషన్ నిర్వహించేలా చైతన్య పరచటంతోపాటు క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి చెరువులు, కుంటలు కలుషితం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించాల్సి ఉంటోంది.

7న (మూడో రోజు) మురుగు కాల్వల్లో పూడిక తొలగించాలి. వర్షం, మురుగునీరు నిలవకుండా డ్రైనేజీల్లోకి మళ్లించాలి. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. స్థానిక రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చాలి. తాగునీటి చేతిపంపులు,డ్రైనేజీల్లో మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి.

8న (నాలుగో రోజు) వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి వాటిపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలి. ప్రజలు తరచూ జ్వరం బారిన పడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వినియోగించాలి. వీధికుక్కల సంఖ్య తేల్చి గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలించాలి.

9న (ఐదో రోజు) శుక్రవారాలను డ్రైడేలుగా పాటించటంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలి. రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తీసేసి, కొత్త మొక్కలను నాటాల్సింటోంది.



ఎప్పటికప్పుడు నివేదిక

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ ఏరోజుకారోజు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేయాలి. పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్త, మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామ స్థాయిలో కార్యక్రమ అమలుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన నివేదికను పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లా అధికారులకు పంపించాలి. పట్టణ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల నివేదికలను కలెక్టర్‌కు ప్రత్యేకాధికారి, వార్డు అధికారులు సమర్పించాల్సి ఉంటుంది.

విజయవంతం చేయాలి...

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో కార్యక్రమ నిర్వహణపై వారు సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జీలు, యువత, స్థానిక నాయకులు పాల్గొనాలని కోరారు. వీధి కుక్కల సమస్య, ఈవీసీ క్యాంపెయిన్, గృహాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్‌లు శుభ్రం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం తదితరాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై వ్యాసరచన పోటీలు, పోస్టర్‌లు ఏర్పాటు చేయడం, తాగునీటిని శుభ్రపరచడం చేస్తామన్నారు. వెట్ మిక్స్‌తో గుంతలు పూడ్చడం దోమల నివారణ చర్యలు చేయడం, కుక్కలకు టీకాలు వేయించడం, పిచ్చి మొక్కలను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరికీ ఆరు మొక్కలను అందజేసి వాటిని నాటి సంరక్షించేలా అవగాహన కల్పిస్తామన్నారు. 5 రోజుల పాటు పట్టణంలో కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించి విజయవంతం చేచాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ రమేష్, వివిధ శాఖ అధికారులు, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్‌గా రాజేందర్



ఘట్‌కేసర్: మండల నాయబ్ (డిప్యూటీ) తహసీల్దార్‌గా కె.రాజేందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మల్కాజ్‌గిరి నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ నాయబ్ తహసీల్దార్‌కు సందీప్‌రెడ్డి కుత్బుల్లాపూర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేయించాలి



మేడ్చల్: దోమ కాటు వల్ల 15 సంవత్సరాల లోపు చిన్నారులకు సోకే మెదడు వాపు వ్యాధి సోకుండా చేసే జేఈ వ్యాక్సిన్ తప్పక వేయించాలని 23వ వార్డు కౌన్సిలర్ కొడే మహేష్ కోరారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్‌లోని ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు మెదడు వాపు వ్యాధి సోకకుండా జేఈ వ్యాక్సిన్‌ను ఆరోగ్య శాఖ అందజేస్తుందన్నారు. తల్లులు తమ పిల్లలకు తప్పకుండా వేయించాలని కోరారు. ఏఎన్‌ఎం రజని, ఆశా వర్కర్లు సునీత, వసంత, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తథ్యం

శామీర్‌పేట్: బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బెల్ట్ షాపులపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లి, మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్, మండల కేంద్రమైన శామీర్‌పేటలో నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో తనిఖీలు చేశారు. 20 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

కీసర: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ కీసర మండల అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కీసరలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిక చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మూడు దశాబ్దాలుగా వర్గీకరణ ఉద్యమ్యాన్ని మంద కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయన పోరాటాల ఫలితంగానే ప్రస్తుతం వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేతలు మొరుగు ముత్యాలు, బక్కని నర్సింగ్‌రావు, బీఎస్పీ మేడ్చల్ నియోజకవర్గం అధ్యక్షుడు బోడ జంగయ్య, నేతలు మంచాల రాజలింగం, బక్కని కుమార్, మొర్గు రవీందర్, బంటు శ్రీనివాస్, బోడ శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌రావు, నరసింహా, సుధాకర్, శ్యాంకుమార్, సంతోష్, మొర్గు నవీన్, ఎర్ర సాయిలు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో...

శామీర్‌పేట్: మూడు దశాబ్దాల మాదిగల నిరీక్షణకు సుప్రీం కోర్టు తీర్పుతో తెరదించినట్లయ్యిందని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. సుప్రీం కోర్టు నేపథ్యంలో జవహర్‌నగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు శివకుమార్, వెంకటేష్, శ్రీనివాస్, ప్రకాశ్, యాకస్వామి, ఆనంద్, నర్సయ్య, కన్ననయ్యరాజు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి స్థలాల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మేడ్చల్: అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా మంజూరైన 5 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, అధికారులు శుక్రవారం స్థలాలను పరిశీలించారు. 6, 8, 10, 11, 14వ వార్డులలో పర్యటించి ఆయా ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించారు. అమృత్ 2.0 పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం రూ. 38 కోట్లు మంజూరయ్యాయని చైర్ పర్సన్ దీపిక తెలిపారు. 6, 8, 10, 11, 14వ వార్డులలోని తాగునీటి సమస్యను తీర్చడానికి ట్యాంకులను నిర్మించనున్నట్లు తెలిపారు. డీఈలు యాదయ్య, విజయలక్ష్మి, కౌన్సిలర్లు మణికంఠగౌడ్, చాపరాజు, శివకుమార్, సుహాసిని, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జగన్‌గౌడ్

మేడ్చల్: బీజేపీ కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు అవిశ్రాంత పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన మేడ్చల్ మున్సిపాలిటీ, రూరల్ మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయని... స్థానిక సంస్థల ఎన్నికల త్వరలో రానున్నందున కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేయాలన్నారు. పదవుల కోసం వెంపర్లాడకుండా పార్టీ గెలుపుకోసం పని చేయాలని అన్నారు. ఎన్నికల వరకు గ్రామాలలో, వార్డులలో దీర్ఘకాలిక వ్యూహరచనలు చేసుకుని ముందుకు సాగాలని అన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కిషన్‌రావు, మాజీ సర్పంచ్‌లు మురళీధర్‌గుప్తా, పోచయ్య, సత్యనారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు ప్రేందాస్, శ్రీకాంత్, రాఘవరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేలో పారిశుద్ధ్యం-పరిశుభ్రతకు ప్రాధాన్యం

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి, సిటీబ్యూరో: వారంలో ప్రతి శుక్రవారం డ్రైడేను కచ్చితంగా పాటించి, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)రాధికాగుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమావేశ భవనంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథస్వామి అధ్యక్షత జరిగిన సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల నివారణకు ఆరోగ్య సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు సమగ్ర జ్వర సర్వేలు నిర్వహించాలన్నారు. లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో చురుకైన వ్యూహాల ద్వారా వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య అవగాహన శిబిరాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులందరూ మెడికల్ స్టాక్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చూసుకోవాలన్నారు. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్‌స్వామి మాట్లాడుతూ... రోగి భద్రతను నిర్ధారించడానికి అన్ని మందుల గడువు తేదీలను రోజూ తనిఖీ చేయాలన్నారు. నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ నిర్వహణ కోసం మందులు 24/7 అందుబాటులో ఉండాలన్నారు. వచ్చే వారంలోగా ఖాళీగా ఉన్న ఆరు స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డెంగీ రిపోర్టులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రస్తుత డెంగీ పాజిటివిటీ రేటు జనాభా విభాగంలో 6.7 శాతంగా కేసులు ఉన్నాయన్నారు. ఒక్కో ఆరోగ్య అవగాహన శిబిరంలో కనీసం 100 మంది రోగులకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఏఎన్‌ఎం వారి నిర్దేశిత ప్రాంతాల్లో 50 ఇళ్ల సర్వే పూర్తి చేయాలన్నారు. క్యాన్సర్ అవగాహన శిబిరాల్లో భాగంగా ఈ నెల 6న జవహర్‌నగర్ పీహెచ్‌సీలో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. అలాగే 8న బాలానగర్ పీహెచ్‌సీలో, 13న మల్కాజిగిరి, షాపూర్‌నగర్ పీహెచ్‌సీ నిర్వహించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కిష్టాపూర్ గ్రామం, అర్చన కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, గ్రామ క్వార్టర్స్‌లతో పాటు అన్ని వ్యవసాయ కనెక్షన్‌లకు విద్యుత్ ఉండదన్నారు.

కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

ఘట్‌కేసర్: కొండాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అవుషాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఘట్‌కేసర్ ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు. అవుషాపూర్, జగత్‌స్వప్న వెంచర్, కేపాల్, అనురాగ్ కళాశాల, వినూత్న హైట్స్, ఆరోరా కళాశాల, శ్రీనిధి రిస్టార్ట్స్, గోల్డన్ వ్యాలీలో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు

నలుగురికి గాయాలు

శామీర్‌పేట్: ఆగి ఉన్న లారీ ఢీ కొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలివీ... గజ్వేల్ వైపు నుంచి కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారి గుండా నగరానికి వస్తున్న ఓ కారు తుర్కపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమా దంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు అయ్యాయి. స్థానికులు చికిత్స ని మిత్తం ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మరణించాడు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు.. ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన దివాకర్ సాహు(46) నగరంలోని ఆదర్శ బార్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. గత నెల 29 విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనం (ఏపీ 05 ఈక్యూ 6627) పై ఇంటికి వస్తుండగా ఘట్‌కేసర్ చిట్టీరుకుంట సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది స్థానిక ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూపులోకి మార్చాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న నేతలు

ఘట్‌కేసర్: ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎంతో వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కందుల కుమార్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్‌లను గ్రూపు డీ నుంచి గ్రూపు ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్ ముదిరాజ్ అధ్యక్షతన తహసీల్దార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీల జనాభాలో 10 శాతం, మొత్తం జనాభాలో 14 శాతం ఉన్న ముదిరాజ్‌లు దుర్భరంగా జీవిస్తున్నారన్నారు. 2023 ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీ, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వు 15 ప్రకారం గ్రూపులోకి మార్చడానికి తెలంగాణ బీసీ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. నేతలు రవికాంత్ ముదిరాజ్, వెంకటేశ్ ముదిరాజ్, జె లింగం ముదిరాజ్, శ్రీనాథ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, ఎస్.లింగం ముదిరాజ్, నరేశ్‌ముదిరాజ్, రాజుముదిరాజ్, కుమార్‌ముదిరాజ్, నవీన్‌ముదిరాజ్, బాలేశ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

బంధువుల ఇంటికెళ్లొచ్చేలోగా చోరీ

ఘట్‌కేసర్: బంధువుల ఇంటికెళ్లి వచ్చేసరికి ఇంటిలో చోరీ జరిగిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్‌లో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సమాచారం మేరకు... గాంధీనగర్‌కు చెందిన మహమ్మద్ అక్రమ్(32) జులై 31న రాత్రి ఇంటికి తాళం వేసి నగరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని శుక్రవారం ఉదయం స్థానికులు అతడికి సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి చేరుకునే సరికి మెయిన్ డోర్ తెరిచి ఉన్నాయి. బెడ్‌రూం లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచుకున్న రెండు వెండి జతల పట్ట గొలుసులు, ఒక జత వెండి కాళ్ల కడియాలు, కొంత నగదు ఎతుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.